# పడగవిప్పిన నేలతల్లి

**'తూ!...** తూ...' అంటూ కొమ్ము బూరల మోతలు. డమ... డమ... డప్పులు, ఇంకా రామడోలు వగైరా వాయిద్యాల మోతలు. ఇంటి ముందు వేసిన ఈతాకుల పందిరి కళకళలాడుతోంది. అంతా పెళ్లి సందడి. ఆ వాయిద్యాల మోతలతో అక్కడ ఉన్నవారిలో ఉత్సాహం మరింత పెరిగింది. ఎవరికి నచ్చిన వారితో వారు గొంతు హెచ్చించి మాట్లాడుకుంటున్నారు.

అరగదీసిన పసుపురాసి పెళ్ళికూతురుకు స్నానం చేయించారు. పొడవుగా నుదుట ఎర్రని కుంకుమ బొట్టు తీర్చిదిద్దారు. పసుపులో ముంచి ఆరవేసిన చీర కట్టి, జాకెట్టు తొడిగారు. చెవులకు తెల్ల కమ్మలు, ముక్కులకు పోగులు, అడ్డబాస పెట్టారు. మెడలో వెండి కంటె, వెండి కాసులు, చేతులకు వెండి కడియాలు, కాలికి అందెలు పెట్టారు. పెద్దమ్మి పెళ్ళికూతురు ముస్తాబులో ఆ గూడెంలోని పెద్దమ్మవారిలా వెలిగిపోతోంది.

"ఏందే సిగ్గూ! అబ్బో నీకేనేటి మనువు? అందరికి అవుద్దిలే!" తోటి పిల్లలు పెద్దమ్మిని ఆటపట్టించారు. పెద్దమ్మి సిగ్గుల మొగ్గయింది.

"పిల్లగాడిని సూసినాయే?" మల్లి అడిగింది.

"ఆ" అన్నట్టు పెద్దమ్మి తలాడించింది.

మల్లిది పక్కగూడెమే. పెద్దమ్మికి చిన్నమ్మ కూతురే. ఇద్దరికి స్నేహమెక్కువ.

"పెళ్ళోరిది మన గూడెం కాదు. ఆరిని నమ్మకూడదట. మా నాయన సెప్పిండు. మరి మనువు సూసుకో?" మల్లి ఎవరు లేకుండా చూసి పెద్దమ్మితో చెప్పింది.

"నే సూసుకుంటాలే" పెద్దమ్మి అర్థమయినట్లే సమాధానం చెప్పింది.

"పెళ్లోరొచ్చేత్తున్నారు! పెళ్లోరొచ్చేత్తున్నారు!" పిల్లల కేకలు వినబడ్డాయి.

కొమ్ము బూరాలు మరింత వేగంగా ఊత్తున్నారు. డప్పులు మరింత గట్టిగా వాయిస్తున్నారు. పెద్దమ్మిని వదలి అందరు పెళ్లి పందిరి వైపు పరుగెత్తారు.

అది ఒక గిరిజన గూడెం. కొండ కింద భూములు సాగుచేసుకుంటున్నారు. పక్కనే సెలయేరు. మరోపక్క చిన్నా, పెద్ద అడవులు.

ఆ అడవుల నుంచి కట్టెలు, పళ్ళు తెచ్చుకుని వాడుకుంటారు. కొన్ని పక్క గ్రామాల్లో అమ్ముకుని కావలసిన సరకులు తెచ్చుకుంటారు. ఆ గూడెంలో కొందరికే నేల ఉంది. కోనయ్యకి ఐదు ఎకరాల నేల ఉంది. కోనయ్యతోపాటు భార్య చెంచులమ్మి, కూతురు పెద్దమ్మి కూడా పొలం పనులు చేస్తారు. వారు ఏ లోటు లేకుండా బతుకుతున్నారు.

పెళ్ళిళ్ళు సాధారణంగా ఆ గూడెంలోని ఆడ, మగ పిల్లలకు ఆ గూడెంవారితో గాని, పక్కగూడెం వారితోగాని జరుగుతుంటాయి. పెద్దమ్మి పెళ్ళి అలా కుదరలేదు. దూర గ్రామం నుంచి వచ్చిన సెలమయ్యతో కుదిరింది. కాని తల్లి చెంచులమ్మికి ఒక్కగానొక్క బిడ్డను దూరం ఇవ్వడం ఇష్టంలేదు. ఆ గూడెంలోని చాలా మందికి నచ్చలేదు.

సెలమయ్య, తండ్రి తరచు ఆ గూడెం వచ్చి సరుకులు ఇచ్చి పుచ్చుకునే వ్యాపారం నడిపిస్తున్నాడు. కోనయ్యకు భూముందని, పైగా పెద్దమ్మి ఒక్కతే కూతురని తెలుసుకుని కోనయ్యతో పరిచయం పెంచుకున్నాడు. సెలమయ్య వినయం నటించి నమ్మించాడు. పైగా గూడెం పెద్ద సింగయ్యను కూడా ఆకట్టుకున్నాడు. సింగన్న చెప్పడంతో కోనయ్య కూతురు పెళ్ళి సెలమయ్యతో కుదిర్చేసాడు. కూతురికి, భార్యకు చెప్పనేలేదు. చెంచులమ్మి ఆ సంగతి విని నెత్తినోరు బాదుకుంది. 'మాటంటే! మాటే' అన్నాడు కోనయ్య, లగ్గానికి ముహూర్తం పెట్టించేసాడు.

"మొండోడు, మాట ఇనుకోడు!" చెంచులమ్మి యింక ఏమి చేయలేక ఊరుకుంది.

అది మిట్ట మధ్యాహ్నం. ఎండ భగభగ మండుతోంది. అదే లగ్గానికి శుభ ముహూర్త సమయం. లగ్గానికి సెలమయ్య తల్లిదండ్రులు, అన్నా వదినా వచ్చారు. కుల పెద్ద వచ్చి వాయిద్యాలు మోగుతుంటే పెళ్ళి తంతు ముగించాడు. పెద్దమ్మి ఇప్పుడు సెలమయ్య పెళ్ళాం! చెంచులమ్మికే దుఃఖం ఆగలేదు. ముఖానికి కొంగు అడ్డుపెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఊరుకో చెంచులమ్మీ; ఏడుత్తావేంటి? ఇగ నీ కూతురు, అల్లుడు మీ యింటికాడనే ఉంటారు, ఏడవబోక!' అన్నాడు సింగయ్య ఓదార్పుగా.

నా కాడనే ఉంటారా? నా చిట్టి తల్లి నాకాడనే ఉంటదా?" ఆమె గుండెల్లో భారం దించినట్లయింది. చిరునవ్వుతో కళ్ళు తుడుచుకుంది.

అందరు భోజనాలు చేశారు. కొందరు ఇప్పసారా, మరికొందరు ఈతకల్లు తాగారు. కొందరు వటవట వాగుతుంటే మరికొందరు నేలకు వరిగారు. సాయంకాలానికి అందరూ తేరుకున్నారు.

"మా సెలమయ్యని మీ సేతుల్లో పెట్టినాం! సక్కగా సూసుకోవాలా" అంటు సెలమయ్య తల్లిదండ్రులు, బంధువులు ప్రయాణమయ్యారు.

"అల్లుడైనా, కొడుకైనా మాకు సెలమయ్యే! మా బిడ్డలానే సూసుకుంటాం!" అన్నారు పెద్దమ్మి తల్లిదండ్రులు.

తమ పనైపోయినట్టు వాళ్ళు వెళ్ళిపోయారు.

సెలమయ్య భార్యతో సరదాగా ఉంటున్నాడు. వారిని చూసుకుని కొనయ్య, చెంచులమ్మి మరింత సంతోషపడ్డారు.

"పెద్దమ్మి కడుపున ఓ కాయ కాయాలా? మనకంతకంటే ఏం కావాలా?" అన్నాడు కొనయ్య.

"పొలం పని అల్లునికి కూడా సెప్పాలా? నీకు కాలు, సెయ్యి కాత్త ఆడుద్ది; అప్పుడు మనువడిని వడిలో ఏసుకుని కూకోవచ్చు" అంది చెంచులమ్మి ముసిముసి నవ్వులు నవ్వుతూ.

భార్య అలా నవ్వుతుంటే కొనయ్య మనస్సు ముచ్చటపడింది. మరునాడు పొద్దుటే అల్లుడిని వెంటపెట్టుకుని వెళ్ళి పొలమంతా చూపించాడు. అల్లునికి తాను చేస్తున్న పొలం పనులు, చేయవలసిన పనులు చెప్పాడు.

"నువ్వంతగా సెప్పాలా? నీ యేంటే నేనుంటాగా! ఏ పని సెయ్యాలంటే ఆ పనే సేసుకుపోతా"

అల్లుడు సమాధానానికి కొనయ్య తృప్తిపడ్డాడు.

"ఈ కొనయ్య అల్లుడే అల్లుడు. ఇంత తెలివి ఈ గూడెపోళ్ళకి ఎడ ఉంటది?" అనుకున్నాడు కొనయ్య.

రెండు వానలు పడగానే పొలం పనులు తిరిగి ప్రారంభించారు. బాగా వెలుగు రాకుండానే భుజాన నాగలి వేసుకుని ఎడ్లను తోలుకుంటూ కోనయ్య బయలుదేరాడు. సెలమయ్య గేదెను, దూడను తోలుకుంటూ మామ వెంటే నడిచాడు. పక్కనున్న అడవిలోకి గేదెను, దూడను వదిలారు. నాగలికి ఎడ్లను కట్టి పొలం దున్నడం మొదలెట్టాడు కోనయ్య. సెలమయ్య యేటిలో నుంచి కడవతో నీళ్ళు తెచ్చి దున్నిన నేల తడుపుతున్నాడు. జాము పొద్దెక్కింది. ఎండ చిర చిర మంటోంది. కడుపులో ఆకలి నకనకలాడుతోంది. అంతలో పెద్దమ్మి చద్ది కూడు మూటతో వచ్చింది. ఆమెను చూడగానే వారి ప్రాణాలు లేచి వచ్చాయి. ఆమె అందించగానే గబగబా చద్ది కూడు తినేసారు.

సెలమయ్యకి పెళ్ళాం ఎదురుగా ఉండిపోతే ఎంతో బాగుంటుందనుకున్నాడు. పెద్దమ్మికి కూడా మగనితో ముచ్చటలాడుతూ అక్కడే ఉండిపోవాలని ఉంది. కాని యింటికెళ్ళి తల్లికి యింటి పనిలో సాయం చెయ్యాలి. తప్పక బలవంతంగా లేచింది. మామ, అల్లుడు తిరిగి పనిలో నిమగ్నమయ్యారు.

సూర్యుడు నడినెత్తి మీదికి వచ్చాడు. మిట్ట మధ్యాహ్నమయింది. నేల ఆవిర్లు వస్తోంది. మామ అల్లుడు అలిసిపోయారు. ఈసారి చెంచులమ్మి వేడివేడిగా వండి పట్టుకొచ్చింది. ఆమెను చూడగానే వాళ్ళు పని ఆపేసి వచ్చారు. చింత చెట్టు నీడలో కూర్చుని కూడు తిన్నారు. కాసేపు కునుకు తీసారు. చెంచులమ్మి కూడా మిగిలింది తిని ఆ నీడలో నడుం వాల్చింది. అక్కడి పొలాలన్నీ మెట్ట పొలాలే. జొన్న, సజ్జ , కంది పంటలతో పాటు పొగాకు కూడా వేస్తారు. తరువాత కాసేపు చెంచులమ్మి నీళ్ళు జల్లడంలో సాయం చేసింది. మెల్లిగా ఇంటికి బయలుదేరి వచ్చేసింది.

సూర్యాస్తమయమవుతోంది. చుట్టూ అడవుల మూలంగా గూడెంలో ముందే చీకటి పడుతుంది. మామ, అల్లుడు నాగలి, ఎడ్లు, గేదె, దూడాతో ఇంటిదారి పట్టారు.

"అబ్బో కోనయ్యా! ఇక నీకేటయ్యా! మంచి అల్లుడినే సంపాదించావు!" జనం అలా అంటుంటే కోనయ్య మీసాలు మెలేసుకున్నాడు. అది కొద్దికాలమేనని తెలుసుకోలేకపోయాడు.

పంటచేలు పెరుగుతున్నాయి. ఆ ఇంట్లోని నలుగురు కంటికి రెప్పలా కాపాడుతున్నారు. పంట ఇంటికి వచ్చిననాడు వారు పడిన శ్రమే మర్చిపోయారు.

ఆ సంవత్సరం జొన్నలు, కందులు విరగపండాయి. అంతా అల్లుడు వచ్చిన వేళా విశేషమనుకున్నారు. పెద్దమ్మి మొగుడి ఒడిలో మరింత ఒదిగి పడుకుంది.

పండిన పంటను దగ్గరలో ఉన్న గ్రామాలకు వెళ్ళి అమ్మి తమకు కావలసిన బియ్యం వగైరాలు కొని తెచ్చుకోవాలి!

"ఈతూరి నేనే పంటను ఎత్తుకెళ్ళి అమ్మి కావలసిన సరుకులు కొనుక్కువస్తా" అన్నాడు సెలమయ్య. అందరు అల్లుడి మాటకు సంతోషించారు.

సెలమయ్య పంటతో ప్రయాణమయ్యాడు. పెద్దమ్మి "నీ యెంట నేను వత్తా! అత్తిల్లు సూడనేలేదు" అంది. కూతురు మాట చెంచుటమ్మికి కూడా నచ్చింది.

"పంటతో ఎడుతున్నా మరోమారు ఎంట పెట్టకుపోతా!" అన్నాడు సెలమయ్య.

"ఈపాలి పోదువుగాని" అన్నాడు కోనయ్య కూడా!

జొన్నలు వగైరాలు బస్తాలకెత్తి బండిలో వేశారు. సెలమయ్య బండి ఎక్కి ముందు తొట్టిలో కూర్చున్నాడు. ఎడ్లను అదిలించాడు. అవి చిరుగంటలు మోగిస్తూ కదిలాయి.

పెద్దమ్మి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. మనువయిన తరువాత మగడిని వదలి ఒక్కరోజు ఉండలేదు.

"ఆ దిగులేటి? నాలుగు దినాలేగా? తిరిగి వచ్చేత్తాడు!" అంది చెంచులమ్మి.

"పెద్దమ్మి కళ్ళు తుడుచుకుంది. అంతలో మల్లి అక్కడకు వచ్చింది. మల్లి తరచు వస్తూ ఉంటుంది. ఇద్దరు బయటకు వచ్చారు.

"పెద్దమ్మీ ఇన్నావా? మన పక్క గూడెంలో 'నీలి' లేదా?"

"ఉందిగా! మరి?"

"ఆమెకు అమ్మా! నాన్నా సనిపోయారుగా! దాని మగడిది నీ మగడు ఊరేగా?"

"అయితే ఏటిటా?"

"ఆడు నీలిని మచ్చిక చేసుకుని నేల రాయించుకున్నాడట? ఇప్పుడు ఆమెను వగ్గేసి మెల్లిగా జారుకున్నాడట!"

మాట వినగానే పెద్దమ్మి గుండెల్లో రాయి పడింది.

"గూడెపోళ్ళు ఊరుకున్నారా?"

"నొల్లి నొల్లి చేత్తే ఏటి? అడు నేల మరెవరికో అమ్మేసినాడట. ఇంకేమి సేత్తరు. నీలికి ఇప్పుడు నిలువ నీడలేకపాయె" అంది మల్లి బాధగా.

"మల్లీ! మరి నా మగడు కూడా! ఈ నేలకోసమే మనువాడినాడంటావా?"

"నేనేటి సెప్పేది? ఆడ జరిగింది సెప్పినా? అంతే. నువ్వు భద్రం. ఆడి మాటలు నమ్మి ఏటిలో మునగక? ఇగనే ఎల్తా! సీకటి పడుతోంది" అంటూ వచ్చిన పనైపోయినట్టు బయలుదేరింది మల్లి.

పెద్దమ్మి ఉండమన్నా వినిపించుకోలేదు, ........ పెద్దమ్మి మనస్సు వికలమయింది..... ఆలోచించింది. "జరగవలసింది జరిగిపోయింది. ముందు జాగ్రత్తపడాలి" అనుకుంది. మనస్సు కాస్త కుదుట పడగానే ఇంట్లోకి వెళ్ళింది.

సెలమయ్య సరుకునంతా సంతలో అమ్మేసాడు. అనుకున్నదాని కంటె ధర ఎక్కువే వచ్చింది. అప్పుడు తల్లితండ్రుల్ని కలుసుకోడానికి యింటికి వెళ్ళాడు.

కొడుకును చూసిన ఆ తల్లి మాతృహృదయం ఉప్పొంగి పోయింది.

కొడుక్కి దగ్గరుండి అన్నం పెట్టింది. కోడల్ని తీసుకురానందుకు బాధపడింది.

"ఈసారి తప్పక ఎంట పెట్టుకు వత్తా!" అన్నాడు సెలమయ్య.

కొడుకు సమాధానం విని ఆ తల్లి తృప్తిపడింది. తల్లి ప్రేమ తప్ప ఆమెకు కుట్రలు, మోసాలు తెలియవు.

సెలమయ్య సరుకులు అమ్మిన డబ్బులో కొంత తండ్రి పుచ్చుకున్నాడు.

"ఏంది కొడుకా! ఇంకా ఆట ఏదీ చక్కబెట్టలేదా! పోనీ! బాగా నమ్మించినావుగా; ఇగ ఆళ్ళు నీ మాటే ఇంటారుగా! ఇదిగో సరుకులమ్మితే ఇంతే సొమ్ము వచ్చిందని నమ్మించాలి?" సలహా ఇచ్చాడు ఆ తండ్రి.

"అట్టాగె నాయనా! నే సూసుకుంటాగా!" అన్నాడు సెలమయ్య.

"అది కాదు కొడుకా! ఇగ ఆలస్యం సెయ్యబోక వెలుగున్నప్పుడే ఇల్లు సక్కబెట్టుకోవాలా? మచ్చిక ఉన్నప్పుడే పూర్తిగా నమ్మించాలా? ఇదిగో ముందు మీ మామను పైకి పంపించు. అప్పుడు ఆ అయిదెకరాల నేల ఇట్టే దక్కుతుంది!"

"అదెట్టా నాయనా?"

"ఓరి అమాయకుడా! నీ మామకు ఈతకల్లంటే పాణం కంటె ఎక్కువ! ఇదిగో ఇదితాగిపించు" అంటు లోపలనుంచి ఓ సీసా పట్టుకొచ్చి కొడుకుచేతి కిచ్చాడు.

"ఇదేటి నాయనా?" అన్నాడు సెలమయ్య ఆశ్చర్యంగా.

"ఈతకల్లు కొడుకా! ఇందులో యిషముంది, జాగ్రత్త" సమయం చూసి తాగిపించి ఖాళీసీసా కనపడకుండా పారేసెయ్యి" ఇగ బయలు దేరు "జర భద్రం కొడుకా!" అన్నాడు ఆ తండ్రి.

సెలమయ్య ఆ సీసాను అతి జాగ్రత్తగా ఎవరికంట పడకుండా దాచిపెట్టి తండ్రి దగ్గర సెలవు తీసుకుని బయలు దేరాడు. దారిలో కావలసిన సరుకులు కొని గూడెం దారి పట్టాడు.

సెలమయ్య గూడెం సమీపించేటప్పటికి పొలంలో మామ కోనయ్య కనబడగానె అటు కదిలాడు.

"ఏంది అల్లుడూ వచ్చేసినావా? సరుకు తెచ్చినావా?" అంటూ కోనయ్య ఆప్యాయంగా పలకరించాడు.

"తెచ్చినా మామా! నీకు ఇదిగో ఈ ఈతకల్లు తెచ్చినా?" అంటు సెలమయ్య సీసా మూత తీసి కోనయ్య నోటికి అందించాడు.

"అబ్బో! ఏం రుచో" అంటూ కోనయ్య గటగటా తాగేసాడు. వెంటనే నేల మీద పడ్డాడు.

అది చూసి భయపడి సెలమయ్య వేగంగా అక్కడ నుంచి బండితోలుకుని ఇంటిదారి పట్టాడు.

కొంచెం సేపటికి నేల మీద పడి కొట్టుకుంటుంటే దగ్గరగా వెళ్ళి చూసాడు తాతిగాడు. నోటమ్మట నురగలు వస్తున్నాయి.

"కోనయ్య పడిపోయిండు" అంటూ అరిచాడు తాతిగాడు.

చుట్టుపక్కల పొలాల నుంచి జనం వచ్చి ఇంటికి మోసుకువచ్చారు. అది పాముకాటు అనుకున్నారు అందరూ. మంత్రగాళ్ళు వచ్చి మంత్రాలు వేశారు. ప్రయోజనం లేకపోయింది.

"విషప్రయోగమిది? పాముకాటు కాదు" అన్నారు మంత్రగాళ్ళు. ఏదిఏమైనా కోనయ్య చనిపోయాడు.

సెలమయ్య ఇంటికి వచ్చేటప్పటికి ఎదురుగా మామ శవం మీద పడి తల్లీ, కూతుళ్ళు గుండెలు బాదుకుని ఏడుస్తున్నారు.

"మావో! మావా! ఎంత పని జరిగిపోయింది! మావా!" అంటూ మావ శవం పట్టుకుని సెలమయ్య ఏడుపు మొదలుపెట్టాడు. చేత్తో డబ్బు సంచినీ గట్టిగా పట్టుకునే ఉన్నాడు.

"మామంటే ఎంత పేమో?" అనుకున్నారు చూసినవాళ్ళంతా.

"ఏడవబోక. అన్నీ నువ్వే సూడాలా. లేవయ్యా! లే!" అన్నారు కావలసినవాళ్ళు.

కళ్ళు తుడుచుకుంటూ లేచాడు సెలమయ్య. ఆ గూడెంలోని వారేకాదు, పక్క గూడెం వారు కూడా అక్కడికి చేరుకున్నారు.

"ఎవరైనా విషం ఇచ్చేసినారేమో? కోనయ్యకి కిట్టనివాళ్ళెవరబ్బా?" ఆ విషయం కొందరికి చర్చనీయాంశమైంది. కాని ఎవరికీ సెలమయ్య మీద అనుమానం రాలేదు. సెలమయ్య కూడా మరింత జాగ్రత్తపడి నటిస్తూ ఏడుస్తూనే ఉన్నాడు.

కోనయ్య మరణవార్త విని సెలమయ్య తల్లిదండ్రులు వచ్చారు.

ఆ తల్లీ, కూతుళ్లను ఎవరూ ఓదార్చలేక పోతున్నారు. గుండెలు పగిలేలా ఏడుస్తున్నారు. అయినా కాలం ఆగలేదు. నడుస్తూనే ఉంది. కోనయ్య దహన కాండలు పూర్తయ్యాయి. పది రోజులు గడిచాయి. మల్లి, పెద్దమ్మిని వదలడం లేదు. బతిమాలి ఆ తల్లీ కూతుళ్ళ చేత ఏదో కాస్త తినిపిస్తోంది.

"ఒదినే ఇగ కోలుకోవాలా! పెద్దమ్మిని సూసుకుని బతకాల" సెలమయ్య తల్లి ఓదారుస్తునే ఉంది.

"ఆడకూతుళ్ళు ఎలా బతుకుతారో ఏటో! నేల అల్లుని పేర పెట్టి సూసుకోడం మంచిది?" అన్నాడు సెలమయ్య తండ్రి.

చెంచులమ్మి ఏ సమాధానం చెప్పలేదు.

"ఇన్నావా?" అంది మల్లి నెమ్మదిగా పెద్దమ్మి చెవిలో.

ఆ తండ్రీ కొడుకుల్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నించింది పెద్దమ్మి.

గూడెం పెద్దలు సెలమయ్య తండ్రి మాటలు సబబుగా లేవన్నారు.

"ఆ ఆడంగులు మా గూడెం మనుషులు. అరిని మేము ఆదుకుంటాం" అన్నారు.

సెలమయ్య తండ్రి ఇంక వాదించలేకపోయాడు. తన మాటలు అక్కడ సాగవనుకున్నాడు. చడీ చప్పుడు కాకుండా పెళ్ళాన్ని తీసుకుని బయలుదేరి

వెళ్లిపోయాడు. వచ్చిన వారంతా తిరిగి వెళ్లిపోయారు. మల్లి కూడా పెద్దమ్మిని మరోసారి హెచ్చరించి వెళ్లిపోయింది.

సెలమయ్య ఇంక నటించలేకపోతున్నాడు. అతనిలోని మంచితనం తగ్గుముఖం పట్టింది. పెద్దమ్మిని చీటికి మాటికి విసుక్కోవడం మొదలు పెట్టాడు. పెద్దమ్మి మగడి ప్రవర్తనలోని మార్పు ఇట్టే గ్రహించింది.

"దున్నేవాడిదే భూమి అంటారుగా! ఇగ నాదేగా ఈ నేల?" అంటూ నేలను రాసివ్వమని పేచీ మొదలు పెట్టాడు.

"ఈ నేల మాది. నీకు రాసివ్వం" మొండిగా పెద్దమ్మి సమాధానమిచ్చినందుకు ఆమెను చావకొట్టాడు. ఇద్దరి మధ్యా కీచులాటలు ప్రారంభమయ్యాయి. పెద్దమ్మిని తరచూ కొడుతూనే ఉన్నాడు. పెద్దమ్మి ఓర్పుపడుతూనే ఉంది.

"సెలమయ్య ఈ నేల కోసమే తనను మనువాడాడని" పెద్దమ్మి నిర్ధారణ చేసుకుంది. ఆ రోజు మరింత కొట్టాడు. వళ్ళంతా రక్తమే.

"నా కూతురా, నీ ప్రాణం అడి చేతుల్లో పోతదే. నేల రాసివ్వవే" అంటూ తల్లి భోరున ఏడ్చింది.

"ఏడవబోకమ్మా. ఈడి సంగతి నే సూత్తా" అని తల్లికి ధైర్యం చెప్పింది పెద్దమ్మి. ఇంకా మగడు మారుతాడేమోనన్న ఆశ ఉంది. ఆ రోజు ఇప్పకల్లు తాగి ఇంటికి వచ్చాడు సెలమయ్య.

"నేల రాసివ్వకపోతే మీ నాయన్ని సంపినట్టే ఇసమిచ్చి నిన్ను, మీ అమ్మని సంపేత్తా" అంటూ కొడవలితో పెళ్లాం మీదికి ఉరకబోయాడు.

సెలమయ్యని గదిలోకి తోసి బయట గొళ్ళెం పెట్టింది పెద్దమ్మి. ఆనాడు తండ్రి మరణానికి విషప్రయోగం కారణమన్నా ఆమె పట్టించుకోలేదు. ఇప్పుడు బయటపడ్డాడు. ఇంక వదలకూడదనుకుంది. పెద్దమ్మిలోని సహనం నశించిపోయింది. మంచితనం ధైర్యంగా మారి ఆమెలో రూపుదిద్దుకుంది. మనువాడి మోసం చేసిన మగనిని వదలకూడదనుకుంది. అడవితల్లి పడగవిప్పినట్లు బుసకొట్టింది పెద్దమ్మి. మల్లి వచ్చి అండగా నిలబడింది.

పెద్దమ్మి పెద్ద పెద్ద అడుగులేసుకుంటూ గ్రామ పెద్ద దగ్గరకు వెళ్లింది. వెంట మల్లేకాదు తల్లి కూడా ఉంది. గూడెంలోని ఆడవాళ్ళంతా కదలి పెద్దమ్మి వెంట నడిచారు. గ్రామదేవత గుడిముందు అందరు నిలిచారు. పెద్దమ్మి కప్పుకున్న

పమిట తీసి వీపు చూపించింది. ఆమె కళ్ళు భగభగ మండుతున్నాయి. పెద్దమ్మి వీపుమీది వాతలు చూసి అందరు ముక్కున వేలేసుకున్నారు.

"నేను నా మగనిని వగ్గేస్తున్నా" అంది. కాసేపు అంతా నిశ్శబ్దం.

"పెద్దమ్మి మాటంటే మాటే" అన్నాడు గ్రామ పెద్ద సింగయ్య.

"ఇగ సెలమయ్య ఆమె భర్త కాదు" అన్నాడు.

సెలమయ్యను ఈడ్చుకొచ్చారు. కొరడా దెబ్బలతో తరిమి తరిమి కొట్టారు. మల్లి ఈల వేసింది.

"ఇన్ని దినాలు సానా ఓర్పు పట్టింది ఈ తల్లి! ఇప్పుడు ఇగ సేతకాక పడగ విప్పింది నేల తల్లి! ఈ పెద్దమ్మి మాటే అమ్మోరి మాట" అన్నాడు సింగయ్య.

పెద్దమ్మి ధైర్యాన్ని, నిర్ణయాన్ని అందరు మెచ్చుకున్నారు. కూతురికి ఇక చావు దెబ్బలు తప్పినందుకు ఆ తల్లి మనసు కుదుటపడింది.

తన జీవితాన్ని తానే సరిదిద్దుకునే స్త్రీ మూర్తిలా ఇంటి వైపు అడుగులేసింది పెద్దమ్మి.

ఆకాశంలో సూర్యుడు ఆమెకు గొడుగు పట్టాలని నడి నెత్తిమీద నిలిచి ఆమెతో పాటే నడిచాడు.

పత్రిక - మాసపత్రిక, ఆగస్టు 2005.